బొగ్గు గనుల ప్రైవేటీకరణకు కుట్ర

- నేడే హైదరాబాద్ వేదికగా వేలం
- కేంద్రప్రభుత్వ నిర్ణయానికి రాష్ట్ర సర్కారు వత్తాసు?
- వేలంలో పాల్గొనేలా సింగరేణిపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి?
- వేలాన్ని వ్యతిరేకిస్తున్న మెజార్టీ కార్మిక సంఘాలు

గోదావరిఖని, జూన్ 20: దేశంలో బొగ్గు గనులతోపాటు ఇతర ఖనిజాలను వేలం ద్వారా అమ్మి సొమ్ము చేసుకునేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కారు సిద్ధమైంది. అందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు కూడా వత్తాసు పలుకుతున్నట్టు తెలుస్తున్నది. శుక్రవారం హైదరాబాద్ వేదికగా దేశంలోని 60 బొగ్గు గనుల వేలానికి సిద్ధం కాగా, ఈ బొగ్గు గనుల ప్రైవేటీకరణ వేలం పాటకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు తెలుస్తున్నది. ఈ వేలంలో రాష్ట్రంలోని మందమర్రి ఏరియాకు చెందిన శ్రావణపల్లి ఓపెన్ కాస్ట్ బ్లాక్ కూడా ఉన్నది. ఈ ప్రక్రియలో సింగరేణి పాల్గొనేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నదనే విమర్శలు వస్తున్నాయి. 119 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్న శ్రావణపల్లి బ్లాక్‌లో తక్కువ గ్రేడ్ బొగ్గు లభ్యమవుతుందని, తద్వారా నష్టాలు వచ్చే ముప్పు ఉందని సింగరేణి ఆలోచిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఒత్తిడి తేవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రైవేట్ చేతుల్లోకి వెళ్తే కష్టాలే

రాష్ట్రంలోని బొగ్గు నిల్వలను ఇప్పటి వరకు సింగరేణి సంస్థ ఆధ్వర్యంలోనే వెలికితీస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వాటా కలిగి ఉన్న సింగరేణిలో భూగర్భ గనులు నష్టాల్లో ఉన్నా.. ఉపరితల గనుల్లో వస్తున్న లాభాలను సమం చేస్తూ సంస్థను ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రైవేట్ రంగం గనులు నిర్వహిస్తే లాభాపేక్షతో కార్మికుల శ్రమ దోపిడీ జరుగుతుందని స్పష్టం చేస్తున్నారు. సింగరేణి సంస్థపైనా దీని ప్రభావం పడుతుందని, ఈ క్రమంలో ఉద్యోగావకాశాలు, ఇతర సౌకర్యాలు కత్తిరించే ప్రయత్నాలు జరుగుతాయని చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాలు, ఇతర నోటిఫికేషన్ల ద్వారా 20వేల మంది ఉద్యోగాల్లో చేరారు. వీరంతా 20 నుంచి 30 ఏండ్ల వరకు పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. బొగ్గు బ్లాకులు ప్రైవేట్‌కి వెళ్తే వీరి భవిష్యత్తు అగమ్య గోచరంగా మారే ప్రమాదమున్నదని, భవిష్యత్తులో కారుణ్య నియామకాలకు బ్రేక్ పడే ముప్పు ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేలాన్ని అడ్డుకుంటాం

బీఆర్ఎస్ హయాంలో పదేండ్లు ఏ ఖనిజ నిల్వలను కూడా వేలం వేయకుండా కాపాడాం. కాంగ్రెస్ సర్కారు సింగరేణిని వేలంలో పాల్గొనాలని ఒత్తిడి తెస్తున్నది. సింగరేణి యాజమాన్యం కూడా వంతపాడుతున్నది. సింగరేణిలో ప్రైవేటీకరణను అనుమతించబోం.

– మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు

ఐక్య పోరాటాలు చేస్తాం

సింగరేణి బొగ్గు బ్లాక్‌లను వేలం వేసే ప్రక్రియను ఆపకుంటే ఐక్య పోరాటాలు చేస్తాం. వేలం పాట జరిగినా రద్దు చేసే వరకు పోరాడతాం. జాతీయ కార్మిక సంఘం అయిన హెచ్ఎంఎస్‌తోపాటు మాతో కలిసి రావడానికి, పోరాటం చేయడానికి ఇఫ్టూ, ఏఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ ముందుకొచ్చాయి.

– రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి

తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, నేతలు బాల్క సుమన్ తదితరులు

ఆనాడు నై.. నేడు సై!

> మొదటిపేజీ తరువాయి...

ముందే హెచ్చరిస్తున్నట్టు తెలిపారు. సింగరేణికి నాలుగు బొగ్గు గనులు కేటాయించాలని, వేలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు.

సింగరేణిని ఖతం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ

తెలంగాణ రాష్ట్రానికి, అస్థిత్వానికి బీఆర్ఎస్ మాత్రమే రక్షణ కవచమని, శ్రీరామ రక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని కేసీఆర్ వేలసార్లు చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్‌కు 16 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రంలో నిర్ణయాత్మక శక్తిగా ఉంటామని కేసీఆర్ చెబితే, 16 సీట్లతో ఏం చేసుకుంటారని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారని మండిపడ్డారు. ఏపీలో 16 సీట్లు గెలుచుకున్న టీడీపీ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకున్నదని, కానీ చెరో 8 స్థానాలు దక్కించుకున్న కాంగ్రెస్, బీజేపీ సింగరేణిని ఖతం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్వయంగా హైదరాబాద్‌లో బొగ్గు గనుల వేలం పెట్టి దుర్మార్గమైన కొత్త పద్ధతికి శ్రీకారం చుడుతున్నారని మండిపడ్డారు. వేలంపాట ద్వారా గనులు కేటాయించవద్దంటూ 8 డిసెంబర్ 2021న కేంద్రానికి కేసీఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు. ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణిలో రాష్ట్రానికి 51శాతం, కేంద్రానికి 49 శాతం వాటా ఉన్నదని తెలిపారు. కేసీఆర్ లేఖ రాసిన వెంటనే డిసెంబర్ 11న అప్పటి పీసీసీ అధ్యక్షుడు

> వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు క్యాపిటివ్ మైనింగ్ లేకుండా చేసి నష్టాల్లోకి నెట్టారు. ఆ తర్వాత నష్టాల పేరుతో అమ్మేయాలని చూస్తున్నారు. ఇప్పుడు అచ్చం అదే పాలసీని సింగరేణికి ఆపాదించాలని చూస్తున్నారు.
> -కేటీఆర్

ఆపండి వేలం

సింగరేణి బొగ్గు బ్లాకులపై కేంద్రానికి సీఎం రేవంత్ డిమాండ్

ఆ నాలుగు బ్లాకులు సింగరేణి సంస్థకే కేటాయించండి

తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు విద్యుత్ కేంద్రాలకు సింగరేణి గనుల నుంచి బొగ్గు సరఫరా

వేలంతో నాటి అవసరాలపై తీవ్ర ప్రభావం.. ప్రధానికి కేసీఆర్ లేఖ

హైదరాబాద్, మేడ్చల్ 6 (నమస్తే తెలంగాణ): కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ సింగరేణిలో అందుబాటులో ఉన్న బ్లాకులు వేలానికి సంబంధించి మమ్మల్ను సంప్రదించకుండా ఏకపక్షంగా ప్రకటించడం పట్ల ప్రధాని నరేంద్రమోడీకి రాసిన లేఖలో తెలిపారు. బొగ్గు బ్లాకుల వేలాన్ని వ్యతిరేకిస్తున్నామని, సింగరేణిలోని ఆరు భూగర్భ గనులూ నష్టాలు తెస్తున్నాయని, వాటిని మూసివేయాలంటూ కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ సింగరేణి యాజమాన్యానికి సూచనలు చేయడం పట్ల ఆందోళన వ్యక్తంచేస్తూ ప్రధాని నరేంద్రమోడీకి సీఎం కేసీఆర్ ఘాటైన లేఖ రాశారు.

బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి కీలక భూమిక

సాలీనా 65 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తిచేస్తూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడులోని విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు అవసరాలను తీర్చడంలో సింగరేణి సంస్థ కీలకభూమిక పోషిస్తున్నదని సీఎం కేసీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో గల్లు విద్యుత్ డిమాండ్ జూన్ 2014లో 5,661 మెగావాట్లు ఉండగా, 2021 మార్చు నాటికి 13,688 మెగావాట్లకు పెరగనుందని విద్యుత్ ఉత్పత్తికి సరిపడా తగినంతగా బొగ్గు సరఫరా చేయడం చాలా ముఖ్యమని తెలిపారు. సింగరేణిలో బొగ్గు అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రైవేట్ బ్లాకులను మంజూరుచేసినందు, నాటి కీలక రేవంత్‌రెడ్డి కూడా కోల్‌బ్లాక్‌లను వేలం వేయవద్దని, వాటిని సింగరేణికి కేటాయించాలని కోరుతూ ప్రధానమంత్రికి లేఖ రాశారని గుర్తుచేశారు. అంతలోనే ఇప్పుడు ఏం మార్పు వచ్చిందని, గనుల వేలానికి ఇప్పుడు ఎందుకు మద్దతు తెలుపుతున్నారని ప్రశ్నించారు. కేసుల భయమా? లేదంటే ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అని నిలదీశారు.

స్టీల్‌ప్లాంట్ ప్లానే.. సింగరేణికి

నష్టాల పేరుతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఎలా గైతే ప్రైవేటీకరిద్దామని అనుకున్నారో, సింగరేణిని కూడా అలాగే చేద్దామని అనుకున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. సింగరేణి ప్రైవేటీకరణ కోసమే గనులు కేటాయించకుండా వేలాన్ని ముందుకు తీసుకొచ్చారని ఆరోపించారు. 23 ఫిబ్రవరి 2016లో ఒడిశాలోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్‌కు అప్పటి మోదీ ప్రభుత్వం రెండు గనులు, 2015లో గుజరాత్‌లోని రెండు ప్రభుత్వ రంగ సంస్థలకు నాలుగు కోల్ బ్లాక్‌లను కేటాయించినట్టు గుర్తుచేశారు. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై అభ్యంతరంతో వేలం లేకుండా మూడు లిగ్నైట్ గనులను కేటాయించారని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి స్వయంగా తన ఎక్స్ ఖాతాలో ఈ విషయాన్ని పేర్కొన్నారని తెలిపారు. మరి సింగరేణికి మాత్రం గనులు ఎందుకు కేటాయించరని ప్రశ్నించారు. దీనివెనక సింగరేణిని ప్రైవేటుపరం చేసే కుట్ర దాగి ఉన్నదన్న అనుమానాన్ని వ్యక్తంచేశారు.

> గనుల వేలం వద్దని పీసీసీ హోదాలో లేఖ రాసిన రేవంత్‌లో అంతలోనే ఏం మార్పు వచ్చింది. వేలానికి ఇప్పుడెందుకు మద్దతునిస్తున్నారు. వేలానికి స్వయంగా మంత్రి భట్టిని పంపుతున్నరు. కేసుల భయమా? లేదంటే ఇంకేమైనా కారణాలు ఉన్నాయా?
> -కేటీఆర్

సింగరేణి బలపడితే రాష్ట్రానికి బలం

తొమ్మిదేండ్లు తమ మెడపై కత్తిపెట్టినా వేలం జరగకుండా అడ్డుకున్నామని కేటీఆర్ తెలిపారు. సింగరేణి బలపడితే కార్మికులు బలపడతారని, సింగరేణి బలపడితే రాష్ట్రం బలపడుతుందని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో సింగరేణి కార్మికులు 36 రోజులు సమ్మె చేస్తే దక్షిణభారతదేశం మొత్తం అంధకారంలోకి వెళ్లే పరిస్థితి వచ్చిందని గుర్తుచేశారు. సింగరేణిని బీఆర్ఎస్ తప్పకుండా కాపాడుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి ఒకరు కేంద్రమంత్రి అయితే మనకు ఏదైనా ప్రాజెక్టు రావాలి కానీ, ఉన్నది అమ్మే పరిస్థితి తెచ్చారని దుమ్మెత్తి పోశారు. బీజేపీకి 8 సీట్లు ఇస్తే ప్రజలకు వారిచ్చే రిటర్న్ గిఫ్ట్ ఇదేనా? అని ప్రశ్నించారు. శుక్రవారం నాటి వేలంలో డిప్యూటీ సీఎం ఎందుకు పాల్గొంటున్నారని, వేలంలో పాల్గొనడం అంటే ప్రైవేటీకరణకు మద్దతు ఇస్తున్నట్టేనని పేర్కొన్నారు.

సింగరేణిని కాపాడేది బీఆర్ఎస్సే

సింగరేణిని కాపాడేది, కాపాడగలిగేది కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణిపై కేంద్రం కత్తిపెడితే కాంగ్రెస్ ఆ కత్తికి సానపెడుతున్నదని దుయ్యబట్టారు. కార్పొరేట్ గద్దలకు బొగ్గు గనులు కేటాయించేందుకు కాంగ్రెస్, బీజేపీ కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. 2028లో తాము అధికారంలోకి వచ్చాక ఈ నిర్ణయాన్ని సమీక్షించి అడ్డుకుంటామని, కాబట్టి వేలంలో పాల్గొనే ప్రైవేటు కంపెనీలను తాము ఇప్పుడే హెచ్చరిస్తున్నాని, అప్పుడు తమను తప్పుబట్ట వద్దని సూచించారు. బొగ్గు గనుల వేలం నిర్ణయాన్ని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండుమూడు రోజుల్లో దీనిపై కార్యాచరణ ప్రకటిస్తామని కేటీఆర్ వివరించారు. మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, హరిప్రియానాయక్, ఆనంద్‌కుమార్, చందర్, మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి పాల్గొన్నారు.

> 2028లో మేం అధికారంలోకి వచ్చాక వేలం నిర్ణయాన్ని సమీక్షిస్తాం. కాబట్టి వేలంలో పాల్గొనే ప్రైవేటు కంపెనీలు తొందరపడొద్దని ఇప్పుడే చెప్తున్నం. ఆ తర్వాత మమ్మల్ని తప్పుబట్టవద్దు.
> -కేటీఆర్

> బీఆర్ఎస్‌కు 16 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రంలో నిర్ణయాత్మకశక్తిగా ఉంటామని కేసీఆర్ చెబితే, 16 సీట్లతో ఏం చేసుకుంటారని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఏపీలో 16 సీట్లు గెలుచుకున్న టీడీపీ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకున్నది. చెరో 8 స్థానాలు దక్కించుకున్న కాంగ్రెస్, బీజేపీ సింగరేణిని ఖతం చేస్తున్నాయి.
> -కేటీఆర్



Date: 11th December 2021

To,
Shri Narendra Modi ji
Hon'ble Prime Minister,
Government of India,
152, South Block, Raisina Hills,
New Delhi- 110001.

Sub.: Request for withdrawal of Coal Ministry's decision to auction four coal blocks in Singareni Collieries and allotment of the same to SCCL.

Respected Sir,

I hope this letter finds you in good health. Through this letter, I wish to bring your attention to the recent decision taken by the Ministry of Coal (MoC), Government of India to auction four coal blocks in Singareni Collieries in the 3rd Tranche for Auction of Coal Mines for Sale of Coal, vide notification dated 12.10.2021.

As you are aware, in October, several power plants in different parts of the country faced severe coal shortages. But thermal power plants in Telangana had stocks to meet the need for the next two weeks. It was possible only due to an adequate supply of coal from Singareni Collieries Company Limited (SCCL).

The SCCL is a joint venture of the Government of Telangana and the Governments of India with a 51:49 equity shareholding. It is now producing coal from 45 mines and operating a 1200 MW (2X600) MW power plant. Out of 64.02 Mt of coal produced in 2019-20, approximately 52.95 Mt was provided to the power industry in the Southern Region. It has set a goal of reaching 80 Mt by 2023-24. Approximately 80% of this output will go to the power industry.

SCCL has proposed to produce an additional 11 MTY coal to reduce the import of thermal coal by the power plants. Extension of existing mines/mining leases is only technically feasible for all practical purposes and conservation of reserves. The extension of existing mines fall in these 4 coal blocks namely-

1) Kayagudem Block – III – Bhadradri Kothagudem District
2) Sattupalli Block- III – Khammam District
3) Shravanapalli – Mancherial District
4) KalyaniKhani Block C – Mancherial District

Flat No. 204-C Road No. 4A Jubilee Hills, Hyderabad - 500 033, Telangana State, India
Ph.: (91) 40-23542204, Cell : +91 9704068800, +91 9440808800, Email : revanth.reddy@yahoo.com

2021లో ప్రధానికి రేవంత్‌రెడ్డి రాసిన లేఖ

తాను లేఖరాసినట్టు రేవంత్‌రెడ్డి చేసిన ట్వీట్

భట్టి వ్యాఖ్యలకు ప్రతిమ ఇన్‌ఫ్రా ఖండన

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని సింగరేణి బొగ్గు గనుల్లో ప్రతిమా ఇన్‌ఫ్రా గ్రూపునకు ఎండీవో (మైన్ డెవలపర్-ఆపరేటర్) కేటాయింపుపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేసిన ఆరోపణలను సంస్థ వైస్ ప్రెసిడెంట్ పీ అనిల్‌కుమార్ ఖండించారు. సింగరేణి కాలరీస్ సంస్థతో తమకు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి సంబంధం లేదని గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరో డిప్యూటీ సీఎంను తప్పుదారి పట్టించారని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ అటువంటి వ్యక్తుల మాటలు నమ్మవద్దని హితవు పలికారు.

నేడు బొగ్గు గనుల వేలం

వేలానికి దూరంగా సింగరేణి

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ వేదికగా శుక్రవారం బొగ్గు గనులను వేలం వేయనున్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వేలాన్ని ప్రారంభిస్తారు. కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల సహాయమంత్రి సతీశ్‌చంద్ర దూబే, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బొగ్గుశాఖ కార్యదర్శి అమృత్‌లాల్‌మీనా పాల్గొంటారు. మొత్తం 60 గనులను వేలం వేస్తారు. ఇందులో తెలంగాణ నుంచి ఒక గని కూడా ఉన్నది. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనడం లేదు.

డ్రైనేజీ గుంతలోకి దిగి మున్సిపల్ కార్మికుడి మృతి

మహబూబ్‌నగర్, జూన్ 20 : చెత్తను తొలగించేందుకు డ్రైనేజీలోకి దిగిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మహబూబ్‌నగర్‌లో వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఏగుగొండకు చెందిన చంద్రయ్య (55) స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో కాంట్రాక్ట్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం కాలనీలో డ్రైనేజీ గుంతలోకి దిగి ప్రాణాలు కోల్పోయాడు. ఆచూకీ లేకపోవడంతో గురువారం అనుమానంతో డ్రైనేజీ వద్ద చూడగా చంద్రయ్య మృతదేహం కనిపించింది.

వేలాన్ని ఆపి తీరాల్సిందే

గనులను సింగరేణికే కేటాయించాలి • అవసరమైతే అఖిలపక్షంతో ప్రధాని వద్దకు వెళ్దాం: డిప్యూటీ సీఎం భట్టి



ఖమ్మం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, జూన్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలోని బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని, అలా కాకుండా వాటిని వేలం వేస్తే సహించేది లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తేల్చి చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి, రాందాస్‌నాయక్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి ఖమ్మం కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడారు. బొగ్గు గనుల కేటాయింపు వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తున్నదని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యంగా ఉన్న సింగరేణి సంస్థకే ఆ గనులను కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కోయగూడెం, సత్తుపల్లి సింగరేణి గనులను వేలంలో పొందిన అరబిందో, ప్రతిమ కంపెనీలు ఎవరికి సన్నిహితమో ప్రజలకు తెలుసునని విమర్శించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి సమస్యను వివరిస్తామని తెలిపారు. 2015లో బొగ్గు గనులను వేలం ద్వారా కేటాయించాలని కేంద్రం చట్టం చేసిందని, ఈ చట్టానికి నాటి బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలికారని ఆరోపించారు. బొగ్గు గనుల వ్యవహారంపై త్వరలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అఖిలపక్షంతో ప్రధానిని కలిసి సమస్య తీవ్రతను వివరిస్తామని తెలిపారు. అఖిలపక్ష ప్రతినిధి బృందంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు తాను, మరికొందరి మంత్రులు, రాష్ట్రంలోని అన్ని ప్రధాన రాజకీయ పక్షాల నేతలు, సీపీఐ శాసనసభ్యుడు ఉంటారని వివరించారు. బీఆర్ఎస్ కూడా ఈ అఖిలపక్షంలో భాగస్వామ్యమై తన చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు. బొగ్గు గనుల కేటాయింపునకు సంబంధించి తొలుత కేంద్రాన్ని కోరుతామని, సాధ్యంకాని పక్షంలో వేలం ద్వారానైనా సాధించుకునే ప్రయత్నం చేస్తామని స్పష్టం చేశారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. 2015లో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల అధికారంలో వందేళ్ల చరిత్ర గల సింగరేణికి గనులు కేటాయించకుండా చేశారన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ మీద ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి బొగ్గు గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వేలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే సింగరేణిని కాపాడుకోవడం కోసం ప్రత్యక్ష ఆందోళన చేపడతామన్నారు.

నిన్న తొండ.. నేడు బల్లి

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 20 (నమస్తే తెలంగాణ): కరెంటు ఎందుకు పోయింది? ట్రాన్స్‌ఫార్మర్‌పై తొండ పడింది. కరెంటు ఎందుకు పోయింది? ట్రాన్స్‌ఫార్మర్‌పై బల్లి పడింది. కరెంటు ఎందుకు పోయింది..? ట్రాన్స్‌ఫార్మర్‌పై పక్షి వాలింది. ఇవీ.. కరెంటు కోతలపై విద్యుత్తు సిబ్బంది చెప్తున్న కారణాలు. తాజాగా, హైదరాబాద్‌లోని సైబర్‌సిటీ ప్రాంతంలో కరెంటు పోవటంతో ఇలాంటి కారణమే చెప్పి నెటిజన్ల ముందు నవ్వులపాలు అవుతున్నారు. సైబర్ సిటీకి చెందిన ఓ వినియోగదారుడు గురువారం తెల్లవారుజామున 5 గంటలకే కరెంట్ పోయిందని అధికారులను ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. అరగంట వ్యవధిలో స్పందించిన విద్యుత్తు సిబ్బంది సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వచ్చి తనిఖీ చేశారు. రెండు బల్లులు కొట్లాడుకొని డీటీఆర్‌పై పడి చనిపోయాయని, దాంతో కరెంట్ సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. విద్యుత్తు సిబ్బంది చెప్తున్న కారణాలపై నెటిజన్లు ఆటాడుకుంటున్నారు. మొత్తానికి రెండ్రోజులుగా తొండలు, బల్లులు కూడా హైదరాబాదీలకు కరెంటు కష్టాలు తెచ్చేందుకు పోటీపడుతున్నాయని ఛలోక్తులు విసురుతున్నారు.

కరెంట్ షాక్‌తో మహిళా రైతు మృతి

రంగారెడ్డి జిల్లా మంచాలలో విషాదం

మంచాల, జూన్ 20: వరి తుకానికి నీళ్లు పారించడానికి వెళ్లిన మహిళా రైతు విద్యుదాఘాతానికి బలైంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మంచాల గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి అరుంధతి (48) తనకున్న నాలుగు ఎకరాల్లో వరితోపాటు ఆకుకూరలు సాగుచేసుకున్నది. ఉదయం నుంచి భార్యాభర్తలు పొలం వద్ద కరెంట్ కోసం గంటల తరబడి ఎదురుచూసి సాయంత్రం ఇంటికి వచ్చారు. అదే సమయంలో కరెంట్ రావడంతో అరుంధతి మళ్లీ పొలానికి వెళ్లింది. రాత్రి 8 అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనతో వెళ్లి చూడగా మోటర్ పంపు పక్కనే విద్యుత్తు షాక్ గురై విగతజీవిగా పడి ఉన్నది. ఉదయం పూట కరెంట్ సరఫరా సక్రమంగా ఉంటే నిండు ప్రాణం బలయ్యేది కాదంటూ కుటుంబ సభ్యులు విలపించారు.

కరెంట్ పోవడంతో చీకట్లోనే మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

కాంగ్రెస్ మీటింగ్‌కూ కరెంట్ కట్

తరచూ అంతరాయం.. చీకట్లోనే మాట్లాడిన షబ్బీర్ అలీ

కంఠేశ్వర్/మాచారెడ్డి, జూన్ 20: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో తరచూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పార్టీ నేతలు షబ్బీర్‌అలీ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో తరచూ కరెంట్ పోవడంతో నాయకులు, కార్యకర్తలు విసుగుచెందారు. షబ్బీర్ అలీ మాట్లాడుతుండగా రెండుసార్లు కరెంట్ పోయింది. ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని, బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు.

పదెకరాల లోపు వారికే రైతుబంధు!

పదెకరాల లోపు భూమి ఉన్న వారికి, అది కూడా సాగు చేస్తున్న రైతులకు మాత్రమే రైతుభరోసా అందించాలని మాచారెడ్డి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో చేసిన ఈ తీర్మానం చర్చనీయాంశమైంది. మాచారెడ్డి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నర్సింగ్ రావు అధ్యక్షతన గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా షబ్బీర్‌అలీ హాజరుకాగా, రైతుభరోసాను పదెకరాల లోపు రైతులకే పరిమితం చేయాలని, అది కూడా పంటలు పండించే వారికే ఇవ్వాలని తీర్మానం చేశారు. తీర్మాన ప్రతిని షబ్బీర్‌అలీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుభరోసాపై రాష్ట్రంలోనే మొదటిసారి ఈ విధంగా ఏకగ్రీవంగా తీర్మానం చేసిన మండల పరిషత్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

భర్త మేడిపల్లి సత్యంతో రూపాదేవి (ఫైల్)

చొప్పదండి ఎమ్మెల్యే సతీమణి ఆత్మహత్య

అల్వాల్‌లో ఘటన

*హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 20 : కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి ఆత్మహత్య చేసుకున్నారు. హైదరాబాద్ అల్వాల్‌లోని పంచశీల కాలనీలో గల తన నివాసంలో గురువారం ఉరి వేసుకొన్నారు. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. వీరిది ప్రేమ వివాహం. వీరికి బాబు, పాప ఉన్నారు. అయితే భార్యభర్తల మధ్